## దుర్గాదేవికి పూజలు

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 22: జిల్లాకేంద్రంలోని విశ్వనాథ స్వామి దేవస్థాన కాలక్షేప మండపంలో బెంగాలీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా 108 దీపాలు, 108 తామరా పూలు, 9 కలాశాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. బోడ ధర్మేందర్, రీనా రాఫీదాస్, దీపిక బిశ్వాస్, దేవీపవిత్ర, ప్రియ సర్కార్ పాల్గొన్నారు.

# సైక్లింగ్‌లో సత్తా..

- చాటుతున్న బెల్లంపల్లి జడ్పీ బజార్ ఏరియా పాఠశాల విద్యార్థులు
- రెండేళ్ల వ్యవధిలో సైక్లింగ్ అకాడమీకి ఇద్దరు ఎంపిక



సైక్లింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విష్ణువర్ధన్, వర్షిత్

బెల్లంపల్లి, అక్టోబర్ 22 : బెల్లంపల్లిలోని జిల్లా పరిషత్ బజార్ ఏరియా ఉన్నత పాఠశాల విద్యార్థులు సైక్లింగ్‌లో సత్తా చాటుతున్నారు. కోట విష్ణువర్ధన్, ఎం.వర్షిత్ రెండేళ్ల వ్యవధిలో సైక్లింగ్ అకాడమీకి ఎంపికై శిక్షణ పొందుతున్నారు. వర్షిత్ తల్లి రాజేశ్వరి అదే పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తోంది. విష్ణువర్ధన్ తండ్రి మహేందర్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. 2021-2022 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విష్ణువర్ధన్, వర్షిత్ కరోనాకు ముందు నుంచే ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పీడీ బాబురావు వద్ద సైక్లింగ్‌లో శిక్షణ పొందారు. టెన్త్ పూర్తి చేసిన వర్షిత్ బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, విష్ణువర్ధన్ జైపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో చేరారు. వర్షిత్ గతేడాదే సైక్లింగ్ అకడామీకి ఎంపిక కాగా, విష్ణువర్ధన్ ఈ ఏడాది అర్హత సాధించాడు. రాష్ట్ర స్థాయిలో ఈ ఏడాది 30 మంది విద్యార్థులు ఎంపిక కాగా, మంచిర్యాల జిల్లా నుంచి విష్ణువర్ధన్ మాత్రమే ఉండడం విశేషం. ప్రస్తుతం బెల్లంపల్లికి చెందిన వీరిద్దరూ సైక్లింగ్‌లో శిక్షణలో ఉన్నారు.

### రైల్వేలో ఉద్యోగం సాధిస్తాను..

హైదరాబాద్‌లోని సైక్లింగ్ అకాడమీలో గతేడాది నుంచి శిక్షణ తీసుకుంటున్నాను. రైల్వేలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా కష్టపడి శిక్షణ పొందుతున్నాను. చిన్నప్పటి నుంచే నాకు ఆటలంటే ఇష్టం. పాఠశాల పక్కనే ఉన్న తిలక్ గ్రౌండ్‌లో అన్ని రకాల ఆటలు ప్రాక్టీస్ చేసేవాడిని. పీడీ బాబు రావు శిక్షణలో అకాడమీకి ఎంపికయ్యాను. ప్రతిరోజూ ఇక్కడి ట్రైనర్స్ చెప్పిన విధంగా చేస్తూ తర్ఫీదు పొందుతున్నాను.

**-వర్షిత్, విద్యార్థి**

### కరోనా కాలం సద్వినియోగం ..

కరోనా రాక ముందు నుంచే పీడీ బాబురావు ఆధ్వర్యంలో సైక్లింగ్‌లో తర్ఫీదు పొందాను. కరోనా సమయంలో వెసులుబాటు ఉన్నప్పుడు సైక్లింగ్‌ను పూర్తిగా ప్రాక్టీస్ చేశాను. అకాడమీలో ఖచ్చితంగా చోటు సంపాదించాలనే లక్ష్యంగా కఠోరంగా శ్రమించిన. చివరికి ఈ ఏడాది సైక్లింగ్ అకాడమీలో స్థానం దక్కించుకున్నాను. డిగ్రీ వరకు ఇక్కడే శిక్షణ పొందుతాను. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

**-విష్ణువర్ధన్, విద్యార్థి**

## డైరెక్టర్‌కు పరామర్శ

గోదావరిఖని, అక్టోబర్ 22 : సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరాం తండ్రి ఇటీవల మృతి చెందగా, సింగరేణి అధికారుల సంఘం నాయకులు శనివారం బలరాంను పరామర్శించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పోనుగోటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు జక్కా రెడ్డి, రిటైర్డ్ డైరెక్టర్ శంకర్ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న అధికారుల సంఘం నాయకులు

# విజయీభవ

- నేడు విజయదశమి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు
- ఆలయాలు ముస్తాబు
- రామ్‌లీలాకు సర్వం సిద్ధం

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 22 : దసరా.. హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు 9 రోజులు దేవీ నవరాత్రులు. పదో రోజు విజయదశమి కలిసి దసరా అంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. దీనిని నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కాబట్టి ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగను మొదటి మూడు రోజులు పార్వతీ దేవికి, తర్వాత లక్ష్మీదేవికి, తర్వాత మూడు రోజులు సరస్వతీ దేవికి పూజలు నిర్వహిస్తారు. అలాగే ఆలయాల్లో అమ్మవారిని ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేస్తారు. తెలుగువారు దసరాను 10 రోజులు జరుపుకుంటారు. తెలంగాణలో 9 రోజులు అమావాస్య నుంచి నవమి వరకు బతుకమ్మ ఆడతారు. పలు చోట్ల రావణాసుర దహనం పేరిట 'రామ్‌లీల' నిర్వహిస్తుంటారు. ఈ యేడాది మంచిర్యాల జిల్లాలో 23వ తేదీ సోమవారం విజయదశమి నిర్వహించనున్నారు.

### చెడుమీద మంచి విజయం..

చెడుమీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను విజయదశమి అని పిలుస్తారు. మనిషి తనలోని కామ, క్రోధ, మధ, మత్సర, మోహ, లోభ, స్వార్థ, అన్యాయ, అమానవత, అహంకారం అనే పది దుర్గుణాలను ఈ నవరాత్రుల్లో తొలగించుకునేందుకు ఆధ్యాత్మికంగా ఉత్తమమైన మార్గం. దీనిని 10 రోజుల పాటు జరుపుకుంటారు. ముందు నవరాత్రులు దుర్గపూజ ఉంటుంది. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుడిపై గెలిచిన సందర్భమే కాకుండా పాండవులు వనవాసం వెళ్తూ జమ్మిచెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసుకున్న రోజుగా చెబుతుంటారు. ఈ సందర్భంగా రావణ వధ, జమ్మి ఆకుల పూజ చేయడం అనవాయితీగా వస్తున్నది. జగన్మాత అయిన దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసుడితో 9 రాత్రులు యుద్ధం చేసి అతన్ని వధించి జయాన్ని పొందిన సందర్భంగా పదో రోజు ప్రజలంతా సంతోషంగా పండుగ జరుపుకున్నారు. అదే విజయదశమిగా పేర్కొంటారు.

### మహిషాసురుని వధ..

బ్రహ్మదేవుడి వరాలతో వర గర్వితుడైన మహిషాసురుడు దేవతలతో ఘోరమైన యుద్ధం చేసి వారిని ఓడించి ఇంద్ర పదవిని చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొరపెట్టుకోగా మహిషునిపై వారిలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజంగా మారింది. త్రిమూర్తుల తేజం కేంద్రీకృతమై ఒక స్త్రీ రూపమై జన్మించింది. శివుని తేజం ముఖంగా, విష్ణు తేజం బాహువులుగా, బ్రహ్మతేజం పాదాలుగా కలిగి మంగళమూర్తిగా అవతరించిన ఆమె 18 చేతులను కలిగి ఉంది. ఆమెకు శివుడు శూలాన్ని, విష్ణువు చక్రాన్ని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని, వరుణ దేవుడు పాశం, బ్రహ్మదేవుడు అక్షమాల, కమండలం హిమవంతుడు సింహాన్ని వాహనంగాను ఇచ్చారు. ఇలా సర్వదేవతల ఆయుధాలు సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన యుద్ధాన్ని చేసింది. మహిషాసురుని తరపున యుద్ధానికి వచ్చిన ఉదగ్రుడు, మహాహనుడు, అసిలోముడు, బాష్కలుడు, బిడాలుడు మొదలైన వారిని సంహరించిన తర్వాత మహిషాసురునితో తలపడింది. ఈ యుద్ధంలో ఆ దేవి వాహనమైన సింహం శత్రువులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిషాసురు రూపం, సింహరూపం, మానవ రూపంతో భీకరంగా పోరు, చివరకు మహిషి రూపంలో దేవి చేతిలో హతుడయ్యాడు. అప్పటి నుంచి మహిషుని సంహరించిన రోజు దసరా పర్వదినంగా పిలుస్తారు. అదే విజయదశమి రోజునే శమీ పూజ కూడా నిర్వహిస్తారు. శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మిచెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమీ అంటే పాపాల్ని, శత్రువులను నశింపజేసేది. పంచపాండవులు అజ్ఞాత వాసానికి వెళ్లే ముందు తమ ఆయుధాలను శమీ చెట్టుపై పెట్టారు. సామాన్యులే కాకుండా యోగులు నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ఆలయాల్లో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి పూజిస్తారు.

### నేడే దసరా పండుగ జరుపుకోవాలి..



దసరా పండుగ ఈనెల 23వ తేదీనే జరుపుకోవాలి. 23 లేదా 24తేదీల్లో ఏరోజు జరుపుకోవాలనే సంశయాన్ని పం డిత సభా నివృత్తి చేసింది. భక్తుల అయోమయాన్ని తొలగించింది. సోమవారం మధ్యాహ్నం నుంచి దశమి తథి ఉం డడం, శ్రవణా నక్షత్రం సోమవారం రోజే ఉండడంతో 23వ తేదీనే పండుగను జరుపుకోవాలి. సాయంత్రం శమీ (జమ్మి చెట్టు) దర్శనం చేసుకోవాలి. అమ్మవారిని పూజించడంతో సకల పాపాలు తొలగిపోతాయి. విజయాలు కలుగుతాయి.

**- వేమారపు మహేశ్వర్ శర్మ, పూజారి, శివాలయం, చెన్నూర్**



చంద్రపల్లిలో నిర్మించిన సైడ్ డ్రైనేజీ



కాసిపేటలో ఏర్పాటు చేసిన హరితహారం నర్సరీ

# అభివృద్ధి పథంలో కాసిపేట

- పల్లె ప్రగతి నిధులు రూ.90 లక్షలతో అభివృద్ధి
- రూ. 40 లక్షలతో కాలనీల్లో సీసీ, గ్రావెల్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- ఆహ్లాదకరంగా ప్రకృతి వనం
- పూర్తయిన సెగ్రిగేషన్ షెడ్, శ్మశాన వాటిక

తాండూర్, అక్టోబర్ 22 : మండలంలోని కాసిపేట గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత అందించిన పల్లె ప్రగతి నిధులు రూ.90లక్షలతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అంతేగాకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గ్రామంలో 580 ఇండ్లు ఉండగా, 1,990 మంది జనాభా, అందులో 1100 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 277 మందికి వివిధ రకాల పెన్షన్లు అందుతున్నాయి. పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన పనులన్నీ పూర్తి చేశారు. రూ. 11లక్షలతో వైకుంఠధామం, రూ. 2.50 లక్షలతో డంప్ యార్డు నిర్మించారు. రూ. 2లక్షలతో హరితహారం నర్సరీని ఏర్పాటు చేసి అందులో 15 వేల మొక్కలు పెంచు తున్నారు. రూ. 1.10 లక్షలతో పల్లె ప్రకృతి వనం, హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌లో రూ.2.80లక్షలతో మొక్కలు నాటి వాటి రక్షణ కోసం కోసం ట్రీగార్డ్స్ ఏర్పాటు చేశారు. రూ. 10లక్షలతో ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ కొనుగోలు చేసి తడి, పొడి చెత్తను సేకరించిన సిబ్బంది డంప్ యార్డుకు తరలిస్తున్నారు.

### రూ. 40 లక్షలతో సీసీ, గ్రావెల్ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు..

కాసిపేట, చంద్రపల్లిలో రూ. 40 లక్షలతో సీసీ, గ్రావెల్ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సహకారంతో జడ్పీ, మండల నిధులు, ఉపాధిహామీ, మైన్స్, ఎంపీ ల్యాడ్స్ నుంచి గ్రామానికి నిధులు తీసుకువచ్చి అన్ని కాలనీలకు సీసీ, గ్రావెల్ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించారు. అన్ని కాలనీల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి మూడో తీగను అమర్చారు. అలాగే కొత్తగా ఎల్ఈడీ లైట్లు వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామ రూపురేఖలే మారాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుకు ఇరువైపులా నాటిన మెక్కలు

### గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నాం



గ్రామంలో పల్లె ప్రగతి ద్వారా వైకుంఠధామం, డంప్ యార్డు, పల్లె ప్రకృతి వనాలను నిర్మించాం. ప్రధాన రహ దారుల వెంట విద్యుత్ స్తంభాలు వేయించి ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసినం. కాసిపేట, చంద్రపల్లిలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించినం. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సహకారంతో, పాలకవర్గం, గ్రామస్తుల భాగస్వామ్యంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

**-అస్స రమేశ్, సర్పంచ్, కాసిపేట, తాండూర్**

### ప్రజల సహకారంతోనే..



గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నాం. ప్రభుత్వ నిధులు, ప్రజల సహకారంతో అభివృద్ధిలో ముందుకు సాగుతుంది. పల్లె ప్రగతి కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా నిర్వహిం చాం. గ్రామంలో ఇబ్బందులకు ఆ స్కారం లేకుండా అన్ని వర్గాలతో సమిష్టిగా కృషి చేస్తున్నాం.

**-సాయితేజ, పంచాయతీ కార్యదర్శి, కాసిపేట, తాండూర్**